నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
సోమవారం | 03 | జూన్ 2024 | పేజీలు 8





# సీమకు "చల్ల"ని కబురు..

- మూడు రోజుల ముందే నైరుతి ఆగమనం
- తొలకరితో పులకరించనున్న భూములు



2లో

నైరుతి రుతుపవనాల ప్రభావంతో కర్నూలు నగరంలో మేఘావృతమైన ఆకాశం

- తికమకపెట్టిన పోలింగ్ అంచనాలు
- భారీగా నడుస్తోన్న బెట్టింగ్ వ్యవహారం

# ఎవరి "ఎగ్జిట్" వారిదే..





**కర్నూలు, సూర్య ప్రతినిధి :** సార్వత్రిక ఎన్నికలకు దేశ వ్యాప్తంగా పోలింగ్ ముగిసిన అనంతరం సర్వే రాయుళ్లు చెప్పిన గెలుపు అంచనాలు ఓటర్లను గందరగోళానికి గురి చేశాయి. దేశ వ్యాప్తంగా చివరి దశ పోలింగ్ శనివారం సాయంత్రం 6గంటలకు ముగియడంతో ఎగ్జిట్ పోల్ పేరుతో అనేక సర్వే సంస్థలు, పలు మీడియా సంస్థలు ఎన్నికల్లో ఏ రాష్ట్రంలో ఏ పార్టీకి అనుకూలంగా ఉందో చెప్పాయి. శనివారం అర్ధరాత్రి వరకు అనేక సంస్థలు తమ అంచనాలు పలు మీడియా సంస్థల సహకారంతోనే కాకుండా సామాజిక మాధ్యమాల్లో కూడా వారి అంచనాలు ప్రజలకు వివరిస్తూ నివేదికలు వెల్లడించాయి. అయితే ఏ నివేదిక కూడా ప్రజలను సంతృప్తి పర్చలేకపోయిందని ప్రజల్లో జరుగుతున్న చర్చల ద్వారా తెలుస్తోంది. రాష్ట్ర శాసన సభకు జరిగిన ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్ వివరాలను సుమారు 40 సంస్థలు వెల్లడించాయి.ఇందులో సుమారు 25 సంస్థలు టిడిపి, జనసేన, బిజెపి కూటమిదే గెలుపని చెప్పగా మరో 15 సంస్థలు వైసిపిదే విజయమని ధంకా బజాయించి వెల్లడించాయి. దీంతో ఎగ్జిట్ పోల్ అంచనాలు ఓటర్లను పెద్దగా ఆకర్షించలేదని స్పష్టమవుతోంది. ఎగ్జిట్ పోల్ అంటే ఓటు వేసి బయటకు వచ్చిన అనంతరం ఓటర్లను ఎవరికి ఓటు వేశారో తెలుసుకొని వారిచ్చిన సమాధానంతో ఆయా స్థానాల్లో గెలుపు ఎవరిదో అంచనా వేస్తారు. ఇలా దాదాపు అన్ని స్థానాల్లోనూ ఆయా సర్వే సంస్థలు సర్వే చేసి తమ అంచనాలను వెల్లడించడమే ఎగ్జిట్ పోల్ అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే ఏ సంస్థ ఎక్కడ సర్వే చేసింది, అక్కడ ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఎంత మందిని వారు విచారించారు, ఏ సమయంలో వారు సర్వే నిర్వహించారు.రాష్ట్రంలో ఎన్ని శాసన సభా స్థానాల్లో మిగతా 2లో



జిల్లా అంతటా

## 144 సెక్షన్ అమలు



2లో

జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి. డా.జి సృజన

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో

## ఈసీఐ ఆదేశాలను పాటించండి

- ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అవాంతరాలకు తావు ఉండకూడదు
- టెలికాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా దిశానిర్ధేశం



టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీనివాసులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఎటువంటి అవాంతరాలకు తావులేకుండా మిగతా 2లో

## మల్లన్న సన్నిధికి పోటెత్తిన భక్తజనం



2లో

క్యూలో బారులుదీరిన భక్తులు

కమనీయం ఆహ్లాదకరం

## లింగమయ్య స్వామి దేవస్థానం

- భక్తులను ఆకట్టుకుంటున్న సౌకర్యాలు..

**ఆళ్లగడ్డ,మేజర్ న్యూస్:** పూర్వకాలం రాజులు పెద్దలు దేవాలయాలను మానసిక ప్రశాంతతకు ప్రజల్లో భక్తి భావం పెంపొందించడానికి అన్ని సౌకర్యాలతో దేవాలయాలను నిర్మించారు. కొన్ని దేవాలయాలు కాలక్రమమైన మిగతా 7లో



లింగమయ్య స్వామి దేవస్థానం

ఎన్నికల కౌంటింగ్

## 'అటెన్షన్'



ఓట్లను కౌంటింగ్ చేస్తున్న( ఫైల్‌ఫోటో)



- రేపే కౌంటింగ్-ఏర్పాట్లు పూర్తి
- నేడు పార్టీల కౌంటింగ్ సన్నాహక సమావేశాలు
- ఎగ్జిట్ పోల్స్ మిశ్రమ ఫలితాలతో టెన్షన్
- చివరి దశకు చేరుకున్న బెట్టింగ్‌లు
- రూ.కోట్లలో గెలుపు ,ఓటముల పై పందెలు
- నియోజకవర్గాలకు చేరుకుంటున్న అభ్యర్థులు
- ఆట విడుపు నుంచి కౌంటింగ్ మూడ్

2లో





పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కేంద్రం

# సీమకు "చల్ల"ని కబురు..!



నైరుతి రుతుపవనాల ప్రభావంతో కర్నూలు నగరంలో మేఘావృతమైన ఆకాశం

**కర్నూలు, సూర్య ప్రతినిధి :** సెగలు కక్కిన వేసవి నుంచి ప్రజలకు ఉపశమనంలభించింది. తొలకరి జల్లులతో భూములు పులకరించే సమయం ఆసన్నమైంది. వాతావరణం అన్ని విధాలుగా అనుకూలించడంతో నైరుతి రుతుపవనాలు ఆదివారం రాయలసీమను తాకాయి. వేసవి ఎండలతో అల్లాడిపోతున్న జనులు మరొకటి రెండు రోజుల్లో వర్షపు జల్లులతో సేద తీరనున్నారు. నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు కురిసి భూమాత చల్లబడనుంది. మరో వైపు వేసవి దుక్కులు పూర్తి చేసుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు మంచి వర్షం కురిసి భూమి పదునెక్కితే విత్తనాలు వేసేందుకు సంసిద్ధంగా ఉన్నారు. ఈ ఏడాది వేసవి ఆరంభం నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతూ నిప్పుల కొలిమిలా భగభగ మండాడు. దాదాపు 47డిగ్రీల స్థాయికి వేసవి ఉష్ణోగ్రతలు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంలోనే మే నెల రెండవ వారంలో తుపాను ప్రభావంతో చిన్నపాటి వర్షం కురిసి కొంత ఉపశమనం లభించినా ఆ తరువాత మళ్లీ ఉష్ణోగ్రతు యథాతథ స్థితికి చేరుకున్నాయి. ఆ తరువాత 10రోజులకు మరో తుపాను కారణంగా మళ్లీ ఒకటి, రెండు రోజులు కాస్త చల్లబడినట్లు కనిపించినా గత నాలుగైదు రోజులుగా తీవ్ర వేడితో ఎండలు మండాయి. ఈ పరిస్థితుల్లో నైరుతి రుతుపవనాలు రాయలసీమను తాకడంతో వేసవి కాలం చెల్లినట్లేనని వాతావరణ నిపుణులు వెల్లడిస్తున్నారు. ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు మూడు రోజుల ముందే ప్రవేశించడంతో వాతావరణం చల్లబడుతోంది. మరో 24గంటల వ్యవధిలో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా రుతు పవనాలు విస్తరించి తొలకరి జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. నైరుతి రుతు పవనాలు మొదట అండమాన్ తీరాన్ని మే రెండవ వారంలో తాకినట్లు వారు తెలిపారు. ఆ తరువాత ఎక్కడా ఆటకం కలుగకపోవడంతో మూడు, నాలుగు రోజులు ముందుగానే కేరళ తీరాన్ని మే 30వ తేదీన చేరినట్లు వారు వెల్లడిస్తున్నారు. అక్కడి నుంచి రాయలసీమ, కర్నాటక వైపు కదిలిన పవనాలు మూడు రోజులు ముందుగానే రాయలసీమలో చిత్తూరు జిల్లాలో ప్రవేశించి రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నాయని వివరిస్తున్నారు. రానున్న 24గంటల్లో అనంతపురం జిల్లా మీదుగా జిల్లాలో ప్రవేశించి తెలంగాణా వైపు రుతుపవనాలు కదులుతాయని వారు స్పష్టం చేశారు. నైరుతి రుతు పవనాల కారణంగా ఈ ఏడాది మంచి వర్షపాతం నమోదవుతుందని వర్షాభావ పరిస్థితులు ఉండకపోవచ్చని వాతావరణ నిపుణులు వెల్లడిస్తున్నారు. మంచి వర్షాలతో వ్యవసాయానికి అవసరమైన వర్షపాతం ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో మంచి దిగుబడులు వస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్నికల కౌంటింగ్ అ'టెన్షన్'




ఓట్ల లెక్కింపు కేంద్రం

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో** : సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు కౌంట్‌డౌన్ మొదలైంది. మంగళవారం ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ అటెన్షన్ కనిపిస్తుంది. కౌంటింగ్‌కు ప్రధాన పార్టీలు సోమవారం సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేసుకున్నారు. ఎగ్జిట్ పోల్స్ మిశ్రమ ఫలితాలతో అభ్యర్థుల్లో టెన్షన్ రేపుతుంది. పోలింగ్ తర్వాత అభ్యర్థులు ఆట విడుపు కోసం కొందరు విదేశాలకు, మరి కొందరు దేవాలయాల సందర్శనకు, మరి కొందరు విహార యాత్రలకు వెళ్ళారు. కౌంటింగ్‌కు నియోజకవర్గాలకు అభ్యర్థులు చేరుకుంటున్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములపై బెట్టింగ్ చివరి దశకు చేరింది. రూ. కోట్లల్లో పందెములు జరిగాయి. అధికార యంత్రాంగం కౌంటింగ్‌ను ప్రశాంతంగా ముగించేందుకు అన్ని ప్రయత్నాలను పూర్తి చేసింది. రెండు రోజుల పాటు 144 సెక్షన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయనున్నారు. 30 యాక్ట్‌ను విధించారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు గెలుపు ఓటములపై ధీమాను వ్యక్తం చేస్తున్నా అంతర్గతంగా ఆందోళన స్పష్టంగా కనిపిస్తుంది. ఎగ్జిట్ పోల్స్ మరింత ఉత్కంఠను రేపాయి. నంద్యాల జిల్లా ఎన్నికల కౌంటింగ్ ఆర్‌జిఎం ఇంజనీరింగ్ కళాశాలలో నందికొట్కూరు, శ్రీశైలం, శాంతి రామ్ ఇంజనీరింగ్ కళాశాలలో నంద్యాల, ఆళ్ళగడ్డ బనగానపల్లె, ఫార్మసీ కళాశాలలో డోన్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగనుంది. పాణ్యం నియోజకవర్గ కౌంటింగ్ కర్నూలులో జరుగనుంది. ప్రతి నియోజకవర్గానికి ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఒక పార్లమెంట్ సెగ్మెంట్‌కు కౌంటింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం 12 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. పోస్టల్ బ్యాలెట్ల కోసం ప్రత్యేక కౌంటింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. అధికార ప్రతిపక్షాలకు ఎన్నికలు ప్రతిష్టాత్మకం కావడంతో గెలుపు కోసం సర్వశక్తులను ఒడ్డారు. జిల్లాలో రూ. కోట్లల్లో బెట్టింగ్ జరిగింది. నంద్యాల టీడీపీ అభ్యర్థి ఫరూక్ నంద్యాలలో ఉన్నారు. వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి నంద్యాలకు చేరుకున్నారు. ఆళ్ళగడ్డ వైసీపీ, టీడీపీ అభ్యర్థులు గంగుల బ్రిజేంద్రారెడ్డి, భూమా అఖిలప్రియలు ఆళ్ళగడ్డలో ఉన్నారు. బనగానపల్లె టీడీపీ, వైసీపీ అభ్యర్థులు జనార్థన్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి నియోజకవర్గానికి చేరుకున్నారు. డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డిలు డోన్‌లో ఉన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నియోజకవర్గానికి సోమవారం చేరుకోనున్నారు. నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్త జయసూర్య నియోజకవర్గంలో ఉన్నారు. వైసీపీ అభ్యర్థి ధారా సుధీర్ పోలింగ్ తర్వాత నియోజకవర్గానికి రాలేదు. వైసీపీ ఇన్‌చార్జి బైరెడ్డి సిద్దార్థరెడ్డి నియోజకవర్గంలో ఉన్నారు. పాణ్యం టీడీపీ, వైసీపీ అభ్యర్థులు గౌరు చరితారెడ్డి, రాంభూపాల్‌రెడ్డిలు కర్నూలులో ఉన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి. ఓట్ల లెక్కింపుకు గడువు సమీపిస్తుండటంతో అభ్యర్థుల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తుంది. గెలుపు ఓటములపై లెక్కలు వేసుకుంటున్నారు. పోస్టల్, సర్వీస్, 85 సంవత్సరాల పైబడిన, బెడ్ రీడర్స్, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్‌తో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ఎన్నడు లేని విధంగా ఈసారి నంద్యాల పార్లమెంట్‌లో నంద్యాల 4,640, ఆళ్ళగడ్డ 2,422, బనగానపల్లె 2,415, నందికొట్కూరు 2,187, శ్రీశైలం 2,129, డోన్ 1,916 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా పై నాలుగు విభాగాల్లో ఆళ్ళగడ్డలో 2,712, శ్రీశైలంలో 2,179 , నందికొట్కూరులో 2,360, నంద్యాలలో 4,757, బనగానపల్లెలో 2,567, డోన్‌లో 1,981 పాణ్యంలో 4,588 మంది ఓటర్లు తమ ఓటు హక్కును నంద్యాల పార్లమెంట్‌లో 22,106 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్వేలు మిశ్రమ ఫలితాలను విడుదల చేయడంతో అభ్యర్థుల్లో గుబులును రేపుతున్నాయి. ఒకవైపు టెన్షన్ పడుతూనే మరో వైపు గెలుస్తామన్న ధీమాతో ఉన్నారు.

# ఎవరి "ఎగ్జిట్" వారిదే..!

(మొదటి పేజి తరువాయి)

వారు ఈ సర్వే నిర్వహించారో చెప్పడంలో విఫలమయ్యాయని వారు విమర్శించారు. ఈ సర్వే వివరాలను బట్టి చూస్తే ఒక్కో సంస్థ ఒక్కో రాజకీయ పార్టీకి వంత పాడినట్లుగా ఉందని వారు భావిస్తున్నారు. వాస్తవ ఫలితాలను ఎవరు ఖచ్చితంగా పసిగట్టలేకపోయారని వారంటున్నారు. వాస్తవానికి ఈ సారి ఎన్నికల్లో తమ ఓటు ఎవరికి వేశామో చెప్పడానికి ఓటర్లు సైతం ఇష్టపడటం లేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అనవసరమైన వివాదాల్లో ఇరుక్కోవడం ఎందుకన్న అభిప్రాయం వారిలో కనిపిస్తోందని వారంటున్నారు. తటస్థ ఓటర్లు, మౌనంగా ఉన్న ఓటర్లు ఎటు వైపు ఉన్నారో ఖచ్చితమైన సమాచారం తెలుసుకున్న సంస్థలు ఏవో అంతుబట్టడం లేదని వారు వెల్లడిస్తున్నారు. మౌనంగా ఉంటూ తాము అనుకున్న పార్టీకి ఓటు వేసి ఇంటికి వెళ్లారని వారి అభిప్రాయం ఏంటో కేవలం ఈవిఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తేనే తెలుస్తుందని పేర్కొంటున్నారు. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తరువాత ఆయా సర్వే సంస్థలు వెల్లడించిన నివేదికలకు కాస్తా అటు ఇటు ఉన్న వారు తమ సంస్థ ఘనత అంటూ చెప్పుకుంటారని మిగిలిన వారు పొరపాటు జరిగిందని ముఖం చాటేస్తారని విశ్లేషకులు అంటున్నారు. కాగా సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్ నివేదికలు వెల్లడైన తరువాత ఆయా రాజకీయ పార్టీల అభిమానులు బెట్టింగులు వేయడంలో మరింత వేగం పెంచారని తెలుస్తోంది. రాష్ట్రంలో ఏ పార్టీది అధికారం అన్న మాటపైనే ప్రధానంగా బెట్టింగు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.

# జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు

**జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి. డా.జి సృజన**

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** జూన్ 4వ తేదీన రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్న దృష్ట్యా, జిల్లాలో ప్రశాంత వాతావరణం ఉండేందుకు వీలుగా జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి సృజన ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా జూన్ 3వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంతవరకు వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కావున ఎక్కడా 5 మంది వ్యక్తులకు మించి ఒకే చోట గుమికూడరాదని, బహిరంగ సభలు నిర్వహించ కూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.

### పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో

# ఈసీఐ ఆదేశాలను పాటించండి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఎటువంటి అవాంతరాలకు తావు లేకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అఆంతరాలు కలిగించేందుకు ప్రయత్నించే వారిని నిర్థాక్షిణ్యంగా బయటకు పంపడమే కాకుండా చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఆదివారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమ ఏర్పాట్లను జిల్లాల వారీగా సమీక్షించారు. ఇందులో భాగగా నంద్యాల జిల్లా కలెక్టర్ తన చాంబర్ నుంచి కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈవీఎంల కౌంటింగ్ పూర్తయిన వెంటనే అదే రోజు ప్రతి ఈవీఎంకు సీల్‌వేసి భద్రపరచాలని, మరుసటి రోజు చేద్దాంలే అనుకూంటూ ఆ పనిని వాయిదాను వేయవద్దని మీనా తెలిపారు. ఫలితాల ప్రకటనకు సంబంధించిన ఫారం 21సి/21 ఇలు ఓట్ల లెక్కింపు దినానికి మరుసటి రోజే ఈసీఐకి చేరేలా చేపట్టాల్సిన చర్యలపై మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని అందుకు అనుగుణంగా తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలు అన్ని ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని అందుకు తగ్గట్లుగా అగ్నిమాపక శాఖ నుంచి ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే విధంగా ప్రణాళికా బద్ధంగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆయన ఆదేశించారు.




రాష్ట్ర ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు సూచనలు చేస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

# మల్లన్న సన్నిధికి పోటెత్తిన భక్తజనం

**శ్రీశైలం, మేజర్ న్యూస్ :** అష్టదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాపుణ్య క్షేత్రంలో ఆదివారం రోజున భక్తుల రద్దితో క్యూలైన్లన్ని కిక్కిరిసిపోయాయి. భక్తులతో శ్రీగిరి క్షేత్రమంత జనసందోహంతో నిండుకుంది. భక్తులు పెద్ద సంఖ్యాలో శ్రీశైలంకు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు శ్రీశైలంకు తరలివచ్చారు. ఈ క్రమంలోనే శ్రీశైలం రహదారులన్ని వాహనాలతో కిక్కిరిసిపోయాయి. అదే విధంగా శ్రీశైలంకు చేరుకున్న భక్తులు ఎంతో భక్తి శ్రద్దలతో ముందుగా తమ మ్రొక్కులను తీర్చుకునేందుకు పాతళగంగలో పుణ్యస్నానాలు అచరించి తలనీలాలు సమర్పిస్తూ తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం కోరకు క్యూలైన్ల వద్దకు చేరుకుంటున్నారు. కాగా మల్లన్న దర్శనభాగ్యం కొరకు భక్తుల సంఖ్యా పెరగడంతో ఆలయంలోని క్యూలైన్లన్ని నిండిపోయాయి. ఈక్రమంలోనే దర్శనభాగ్యం కోరకు వచ్చిన భక్తులకు దేవస్థానం అదికారులు ఎటువంటి ఇబ్బందులు తలేత్తకుండా ఏర్పాట్లను చేసారు. అదే విధంగా భక్తుల ఏర్పాట్లపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అదికారుల నుండి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుంది. కాగా భక్తుల రద్దీతో పురవీదులన్ని సందడి చెస్తున్నాయి.



# కౌంటింగ్ రోజు గ్రామాలలో సంయమనం పాటించాలి



గోనెగండ్లలోని గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గ్రామాలలో జూన్ 4వ తేది ఎలక్షన్ కౌంటింగ్ రోజు ప్రజలు సంయమనం పాటించాలని ఎవ్వరు ఆవేశాలకు లోను కాకుండదని సంభరాలు జరుపుకోరాదని సీఐ రామకృష్ణయ్య అన్నారు. ఆదివారం గోనెగండ్ల మండల పరిధిలోని పలు గ్రామాలలో పోలీసులు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మైకులలో బహిరంగంగా ప్రకటనలు కూడా చేస్తున్నారు. కౌంటింగ్ రోజు గ్రామాలలో బణాసంచా కాల్చడం, ర్యాలీలు సభలు, సమావేశాలు, జనం గుంపుగా ఉండటం, మద్యం సేవించి కేకలు వేయడం చేయరాదని తెలిపారు. నిబంధనలను పాటించక పోతే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధనలను వ్యతిరేకిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలుపుతున్నారు.



## వై.బాలనాగిరెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని ప్రార్థనలు

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** మంత్రాలయం నియోజకవర్గం వైసిపి అభ్యర్థి వై. బాలనాగిరెడ్డిని అత్యధిక మెజార్టీతో మళ్లీ ఎమ్మెల్యే గా గెలవాలని ఆదివారం పెద్దకడుబూరు గ్రామంలో స్థానిక సిఎస్ఐ చర్చీ పాష్టర్ ముత్తుమనోహర్ ఆధ్వర్యం లో వైసిపి నాయకులు జగతప్ప ముక్కరన్న. బోగ్గుల అర్లప్ప. కొరవసుందరం. ప్రసాద్. సుక్కుమార్. లోకయ్య. సుధాకర్. ఏసన్న. లాభాన్. షేక్ జోసఫ్‌లు. ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అలగునే వైయస్ జగ న్మోహన్ రెడ్డి మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలోని పేద బడుగు బలహీన వర్గాలకు మరింత మేలు జరుగుతుందని తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గం వై.బాలనాగిరెడ్డి గెలిస్తే వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసే క్యాబినెట్‌ల మంత్రి పదవి రావాలని ప్రత్యేక ప్రార్థనలు ద్వారా ప్రభువైన ఏసు క్రీస్తుదేవునికి వారు మొరపెట్టుకున్నారు.

## చెక్‌పోస్ట్‌ను అడిషనల్ ఎస్పీ తనిఖీ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని చింత కుంట వద్ద ఏర్పాటు చేసిన పోస్టు ను అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమా ర్ ఆదివారం తనిఖీ చేశారు. ఎన్ని కల కోడ్ దృష్టిలో ఉంచుకొని అడిషనల్ ఎస్పి ప్రవీణ్ కుమార్ కోవెలకుంట్ల రోడ్డులో ఉన్న చింత కుంట చెక్పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ సిబ్బందికి తగిన సూచనలను ఇచ్చారు. వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.





## మారెళ్ళలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** మండలం పరిధిలోని మారెళ్ళ గ్రామంలో ఆదివారము అనుమానాస్పందంగా తలారి శ్రీరాములు (50) అనే వ్యక్తి మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాల మేరకు మారెళ్ళ గ్రామానికి చెందిన కొత్త కురువ హనుమంతు, తలారి శ్రీరాములు మధ్య గత సంవత్సరము నుండి మనస్పార్థాలు ఉన్నాయని, దీంతో శనివారం ఉదయం 9.00 గంటల సమయంలో మారెళ్ళ గ్రామంలోనే ఊరు వాకిలి వద్ద తలారి శ్రీరాములు కూర్చుని ఉండగా కొత్త కురువ హనుమంతు, కొత్త కురువ పెద్దయ్య లు తలారి శ్రీరాములు ను కాలుతో తన్ని, అవమాన పరిచినట్లు, దీంతో శ్రీరాములను ఆయన భార్య రంగమ్మ ఓదార్చినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆదివారము మృతుడు తలారి శ్రీరాములు కుమారుడు రాము వారి పొలానికి వెళ్ళగా అక్కడ తండ్రి తలారి శ్రీరాములు మృతదేహం కనిపించడంతో కుమారుడు రాము కుటుంబ సభ్యులకి తెలిపారు. కొత్త కురువ హనుమంతు, కొత్త కురువ పెద్దయ్య లు కలిసి తన భర్త తలారి శ్రీరాములను కొట్టి, మందు పోసి చంపినట్లు మృతుని భార్య తలారి రంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. మృతుడు తలారి శ్రీరాములు అవమానం భరించలేక క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడా ? లేదా ?ఎవరైనా చంపి తర్వాత నోట్లోకి మందు పోశారా ! అనే విషయాలు అనుమాన స్పందనంగా ఉన్నాయి. ఈ విషయాన్ని పోలీసులు విచారించాల్సి ఉన్నది. మృతుడు తలారి శ్రీరాములు భార్య తలారి రంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు.

## అక్రమంగా కర్ణాటక మద్యం స్వాధీనం

### - వ్యక్తి అరెస్టు



అక్రమ కర్ణాటక మద్యంతో పోలీసులు

**మంత్రాలయంరూరల్, మేజర్‌న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని వగరూరు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకొంది. ఎస్.ఐ గోపినాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వగరూరు గ్రామానికి చెందిన కట్టుబడి ఖాదర్ 4 బాక్సుల కర్ణాటక మద్యాన్ని వగరూరు సమీపంలో తీసుకెళ్తుండగా, పోలీసులకు సమాచారం రావడంతో అతనిపై దాడులు నిర్వహించి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ సూచించారు.

# సాలరీ వద్దు.. ప్లేట్ కలెక్షనే ముద్దు

- ఆలయాలలో అర్చకుల తీరు
- మాన్యం భూములు కావాలి.. ప్లేట్ కలెక్షన్ కావాలి
- కుమ్మక్కు అవుతున్న ఆలయ అధికారులు



హారతి ఇస్తున్న అర్చకుడు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రం, జిల్లాలోని పలు దేవాదాయ శాఖ ఆలయాల్లో అర్చకులకు పడితనంతో పాటు మంచి జీతాలు ఉన్నాయి. కొన్ని ఆలయాల్లో అర్చకులు సాలరీ వద్దు ప్లేట్ కలెక్షనే ముద్దు అనే నినాదంతో ముందుకెళ్తున్నారు. అర్చకులు ఆలయానికి చెందిన, తమ స్వాధీనంలో ఉన్న మాన్యం భూములు కౌలుకు ఇవ్వడం చేస్తూ.. ప్లేట్ కలెక్షన్‌ను వదలడం లేదు. ఆలయ భూములు అర్చకుల స్వాధీనంలో ఉంటే ప్లేట్ కలెక్షన్ తీసుకోకూడదనే నిబంధన ఉంది. అందుకు విరుద్ధంగా అర్చకులు ప్లేట్ కలెక్షన్ పైన సైతం దృష్టి సారించడంతో ఆలయాల ఆదాయానికి గండి పడితుందనే వాదన ఉంది. ఇందులో ఆలయ అధికారుల పాత్ర ఉండకనే ఉందని తెలుస్తుంది. ఇది ఇలాగే కొనసాగితే ఆలయాల నిర్వహణ కష్టతరమవుతుందని పలువురి వాదన. పలు ఆలయాల్లో అర్చకులకు రూ.50 వేల నుంచి రూ.90 వేల వరకు జీతాలు ఉన్నాయి. ప్లేట్ కలెక్షన్‌లో కొందరు ఆలయ అధికారులు అర్చకులతో కుమ్మక్కు అయ్యి వాటాలు పంచుకుంటున్నట్లు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే నంద్యాల జిల్లా మహానంది క్షేత్రంలో గతంలో ప్లేట్ కలెక్షన్‌తో అక్కడ అధికారికి భారీగా ముడుపులు ముట్టజెప్పే వారని సమాచారం. ఈఓగా కాపు చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత ప్లేట్ కలెక్షన్‌ను పూర్తిగా నిలిపివేశారు. మహానంది క్షేత్రంలో గతంలో ఏడాదికి నిఖర ఆదాయం రూ.1.50 కోట్లు ఉండేది. ఇప్పుడు ఏడాదికి రూ.3.50 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ఆదాయం వస్తుందని ఆలయ అధికారులు అంటున్నారు. ప్లేట్ కలెక్షన్ తొలగించడంతోనే ఆలయ హుండీ ఆదాయం పెరిగిందని తెలుస్తుంది. రాష్ట్రంలోని చిన్న, పెద్ద ఆలయాల్లో ఇదే తంతు నడుస్తుంది. కర్నూలు జిల్లా కౌతాళం మండలంలోని ఉరుకుంద వీరన్నస్వామి క్షేత్రం గతంలో అసిస్టెంట్ కమీషనర్ హోదాలో ఉండేది. ఇప్పుడు డిప్యూటి కమీషనర్ హోదాగా అప్‌గ్రేడ్ అయింది. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటి కమీషనర్‌గా హెచ్‌జి వెంకటేష్ బాధ్యతలు చేపట్టారు. వెంటనే అక్కడ ప్లేట్ కలెక్షన్‌ను నిర్మూలించి ఆ ఆదాయాన్ని హుండీలో వేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా 15 రోజులకే హుండీ ద్వారా రూ.35 లక్షలు ఆదాయం వచ్చింది. ఈ ప్లేట్ కలెక్షన్ విషయం పై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ డిప్యూటి కమీషనర్ వెంకటేష్ తమ ఆలయం డిప్యూటి కమీషనర్ హోదాకు అప్‌గ్రేడ్ అయిందని వీరికి మంచి జీతాలు ఇస్తున్నందున ప్లేట్ కలెక్షన్ ఉండరాదని ఎమ్మెల్యేకు వివరించారు. అర్చకులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆయన వారి ప్లేట్ కలెక్షన్ విషయంలో ఆయన రాజీ పడలేదు. ఈ విధంగా చర్యలు తీసుకుంటే ఆలయాలు అభివృద్ధి చెంది గ్రామానికి, జిల్లాకు మంచి పేరు వస్తుందని పలువురు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని యాగంటి, నందవరం చౌడేశ్వరీ, కొత్తూరు, ఓంకారం, మహానంది,



నందరం చౌడేశ్వరీ అమ్మవారి దేవాలయం

మూలపెద్దమ్మ, కాల్వబుగ్గ, వెంకాయపల్లె ఎల్లమ్మ, పుట్టాలమ్మ, మద్దిలేటి, ఇతర దేవాలయాల్లో ప్లేట్ కలెక్షన్ కొనసాగుతుంది. కొత్తూరు సుబ్బరాయుడు ఆలయంలో అర్చకులకు నాలుగు ఎకరాల మాన్యం భూమి, టెంకాయ చిప్పలు, అభిషేకం టిక్కెట్లలో వాటా అడుగుతున్నట్లు సమాచారం. అర్చకులు ఇలాగే ఆలోచిస్తుంటే ఆలయ అధికారులు ఆలయ అభివృద్ధికి టిక్కెట్ల ధరలు పెంచి భక్తులకు భారం వేసే పరిస్థితి వస్తుంది. గతంలో ఆర్ఎస్ రంగాపురం సమీపంలోని మద్దిలేటి స్వామి క్షేత్రంలో ప్లేట్ కలెక్షన్ విషయంలో ఈఓ అర్చకుడిని సస్పెండ్ చేయడం జరిగింది. అర్చకులు ఆలయాల అభివృద్ధికి సహకరిస్తే ఆలయాలు అభివృద్ధి చెంది అప్‌గ్రేడ్ అవుతాయి తద్వారా వారి జీతాలు పెరుగుతాయని భక్తులు చర్చించు కుంటున్నారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ప్లేట్ కలెక్షన్ పై దృష్టి సారించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.



పోలీసు పికేట్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి

### అవుకు పోలీసు స్టేషన్ పరిధిలోని పోలీస్ పికేట్‌ను

# నంద్యాల జిల్లా ఎస్పీ తనిఖీ

**అవుకు, మేజర్‌న్యూస్ :** అవుకు పోలీసు స్టేషన్ పరిధిలోని కొండమనాయునిపల్లె, పెట్నికోట, పోలీస్ పికేట్‌ను నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రామాల్లోని ప్రజలు వివాదాలకు దూరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పికేట్‌లోని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతోపాటు స్పెషల్ బ్రాంచ్ ఎస్.ఐ హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల లెక్కింపుకు ప్రతి ఒక్కరు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పీ శ్రీనివాసరావు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల లెక్కింపు రోజున అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు తగు సూచనలు, సలహాలు పాటిస్తు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులకు సహకరించాలని డిఎస్పీ శ్రీనివాసరావు కోరారు. ఆదివారం పోలీసు స్టేషన్ ఆవరణంలో సిఐలు లక్ష్మినారాయణ, నాగభూషణ్ ఆధ్వర్యంలో రాజకీయ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడుతూ ఎన్నికల లెక్కింపు ఈనెల 4వ తేదిన నిర్వహించడం జరుగుతుందన్నారు. అందుకు రాజకీయ నాయకులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లెక్కింపు రోజున ఎలాంటి హంగులు ఆర్భాటాలు చేయరాదని, ముందస్తుగా హాడావుడి చేస్తు అల్లర్లుకు పాల్పడ రాదని, ఊరేగింపులు, బాణా సంచా కాల్చడం లాంటి వాటిని చేయరాదని అన్నారు. లెక్కింపు జరుగుతుండగా ఎలాంటి సంబరాలు చేయరాదని అన్నారు. లెక్కింపు సజావుగా జరిగేందుకు రాజకీయ నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

**గోనెగండ్ల, మేజర్‌న్యూస్ :** ఈ ఖరీఫ్ సీజన్లో ఎరువుల వ్యాపారులు రైతులకు ఎరువులు, విత్తనాలు, ఎంఆర్పీ ధరలకు కాకుండా అధికధరలకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకు కుంటామని ఏడీఏ మహుమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత హెచ్చరించారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఎరువుల వ్యాపారులు మందు నిల్వలను, ధరలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని, స్టాక్ రిజిష్టర్, బిల్లుబుక్ లను ధృవీకరించాలని కోరారు. విత్తనాలకు సంబందించిన సర్టిఫికేట్ ఆఫ్ సోర్స్ ఇతర వివరాలు తప్పని సరిగా ఉండాలని సూచించారు. రైతులకు కొనుగోలు చేసిన వెంటనే వ్యాపారులు రసీదు తప్పని సరిగా ఇవ్వాలని కోరారు. పంట కాలం పూర్తి అయ్యేవరకు రసీదు ను భద్రంగా రైతులు దాచుకోవాలన్నారు.

# చదువు వాల్మీకుల జీవితాలకు వెలుగు

### – విద్యాభివృద్ధి సహకారానికి కృషి
### – ప్రతి వాల్మీకి కుటుంబంలో విద్యావంతులు ఉండాలి



విద్యార్థులకు పురస్కారాలు అంజదేస్తున్న వాల్మీకి ఉపాధ్యాయ బృందం

**కోసిగి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోను, జిల్లాల్లోను పాలకులుగా వాల్మీకులు అత్యధికంగా ఉన్నా.. అటు చదువులోను ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందలేదని ఉద్యోగుల వాల్మీకి సంఘం నాయకులు ఉసేని, తిమ్మారెడ్డి, లక్ష్మీకాంత్, నారాయణ, బంటినేహల్ సత్య, రమేష్‌నాయుడు, సుధాకర్‌బాబు అన్నారు. ప్రతి వాల్మీకుల కుటుంబంలోని జీవితాలు వెలగాలంటే ప్రతి ఒక్కరు చదువుకోవాలని చదువుతోనే జీవితాలకు వెలుగువస్తుందని వారు తెలిపారు. కోసిగిలో ఆదివారం 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు కోసిగి వాల్మీకి ఉద్యోగ బృందం ఆధ్వర్యంలో అందజేశారు. దాదాపుగా 32మంది 10వ తరగతి విద్యార్థులకు మెమెంటో, ఫైల్‌బుక్, పెన్నులు అందజేశారు. అలాగే ఇంటర్ విద్యార్థులకు శ్రీమహర్షి వాల్మీకి మెమెంటోను అందజేయడం జరిగింది. ఇలాంటి పురస్కారాలు చేపట్టడం వల్ల వాల్మీకి విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల వాల్మీకి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన గౌరవం కూడా లభిస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టి విద్యాభివృద్ధికి ప్రతి వాల్మీకులు అండగా నిలవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోసిగి వాల్మీకి ఉద్యోగుల బృందం పాల్గొనడం జరిగింది.

## టీడీపీ కార్యకర్తలు సహనం పాటించండి

### – టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి




విలేకరులతో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** ప్రతి ఒక టీడీపీ కార్యకర్త సహనం పాటించాలని సమర్థవంతమైన విజయం సాధించబోతున్నామని టీడీపీ ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఆయన మాట్లాడుతూ, మంగళవారం జరిగే ఎన్నికల కౌంటింగ్‌లోభాగంగా, జనసేన, బిజెపి, టీడీపీ నాయకులు సహనం కోల్పోకుండా ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిబంధనలు పాటిద్దామన్నారు. పోలీసు సిబ్బంది విధించే నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకుందామని ఆయన తెలిపారు.

### జీవన సంబంధం విష సంస్కృతి

# దేశవ్యాప్తంగా యు.సి.సి అమలు కావాలి

### జీవన సంబంధం మోసాలకు అడ్డుకట్ట
### పర్సనల్ లా, సోషల్ లా అందరికీ సమానం



**కర్నూలురూరల్, మేజర్‌న్యూస్ :** "యూనిఫాం సివిల్ కోడ్ ఎంతో అవసరమని, జీవన సంబంధం మోసాలకు యుసిసి తో అడ్డుకట్ట పడుతుందని, పర్సనల్ లా, సోషల్ లా అందరికీ సమానమేనని, జీవన సంబంధ విష సంస్కృతికి అడ్డుకట్ట వేసేందుకు యు సి సి దేశవ్యాప్తంగా అమలు కావాలని" భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర కోరారు. ఆదివారం కర్నూల్ నగరంలోని 46 వ వార్డు నరసింహారెడ్డి నగర్ లో బిజెపి జిల్లా కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ పెళ్లి, విడాకులు, ఆస్తి, వారసత్వం అంశాలను యూసీసీలో నిర్ధారించారని, మత మధ్యంలో వివక్షకు గురైతే వారికి న్యాయం జరుగుతుందన్నారు. జీవన సంబంధం వల్ల అబ్బాయిలు కానీ, అమ్మాయిలు కానీ మోసం పోయే ప్రమాదం ఉందన్నారు. 18 సంవత్సరాలలోపు వారు సంబంధంలో ఉండ కూడదని, ఉన్నట్లయితే ఆరు నెలలు కట్టిన గార శిక్షతోపాటు 10 వేల నుంచి 30 వేల దాకా జరిమానా ఉంటుందని, 18-22 సంవత్సరాల మధ్య వారు జీవన సంబంధంలో ఉన్నట్లయితే తల్లిదండ్రుల నుంచి అనుమతి ఉండేలా యుసిసి చెబుతుందన్నారు. యుసి సీను ఉత్తరాఖండ్లో అమలు అవుతుంది, రాజస్థాన్లో అమలు కాబోతుందని, అలాగే ప్రతి మతంలో అందరికీ ఒక్కటే అని దేశవ్యాప్తంగా యుసిసి అమలు అయితే జీవన సంబంధాలను అరికడుతూ సనాతన ధర్మం వైపు నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి నాయుడు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.

### ముగిసిన విద్యాభారతి

# ఉపాధ్యాయులకు శిక్షణ




మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి

**నంద్యాలకల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ పీజీ కళాశాలలో గతనెల 15వ తేదీ నుంచి 1వ తేదీ వరకు 18రోజుల పాటు ఆచార్య ప్రశిక్షణా వర్గ-2024ను విద్యాభారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త ఎద్దుల మహేశ్వరరెడ్డి, సభా అధ్యక్షులుగా విద్యాభారతి అధ్యక్షులు ప్రొఫెసర్ గొల్లపల్లి నాగేశ్వరరావు, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానవక్తగా విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు, కన్నా భాస్కర్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 18రోజుల పాటు దీక్షగా కుటుంబాన్ని బదలి ఇక్కడ శిక్షణ తీసుకుని మీ పాఠశాలలో ఇక్కడ నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు బోధించి వారిని భవిష్యత్తులో ఉన్నత స్థితికి ఎదగడానికి తోడ్పాటు అందించాలన్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈశిక్షణా కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్స్ ద్వారా శిక్షణ ఇప్పించడం జరిగిందని మీరు భవిష్యత్తులో మంచి గుర్తింపు పొందాలన్నారు. దేశ నిర్మాణం ఏయడంలో మనవంతు కృషి చేయాలని తెలిపారు. గెలివి సహదేవుడు మాట్లాడుతూ మన మాతృభాష, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు రెసిడెన్షియల్ క్యాంప్‌లో ఉండి శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. మన విద్యావ్యవస్థ ఇంజనీర్లు, డాక్టర్లు తయారు అవుతున్నారన్నారు. మనిషిని యంత్రాల్లుగా తయారు చేస్తున్నాయన్నారు. విద్యార్థులకు సంస్కారం నేర్పాలి వీటిని తల్లిదండ్రులు పెద్దలను చూసి నేర్చుకుంటారు. దేశంలో యస్ఈపి 2020 అమలు కాబోతుందన్నారు. ఈవిద్యావిధానం ద్వారా బడుగు బలహీన వర్గాలకు దళితులకు వనవాసీల కొరకు విద్యాప్రణాళిక రచన జరుగుతుందన్నారు. అనంతరం నేర్చుకున్న కళాత్మక విషయాలు, చిత్రలేఖనం, శాస్త్రీయ నృత్యం, నాటికలు ఏకపత్ర అభినయం, తదితర వాటిని ప్రదర్శించారు.



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు




మాట్లాడుతున్న ఎద్దుల మహేశ్వరరెడ్డి

# ఓట్ల లెక్కింపుపై పరిశీలకుల పర్యవేక్షణ

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 4న నిర్వహించే ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పర్యవేక్షణ నిమిత్తం భారత ఎన్నికల సంఘం సీనియర్ అధికారులను పరిశీలకులుగా నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆళ్ళగడ్డ-134 అసెంబ్లీ నియోజకవర్గానికి అన్నవి దినేష్‌కుమార్, శ్రీశైలం-135 అసెంబ్లీ నియోజకవర్గానికి భగవత్ కిషోర్ మిశ్రా, నందికొట్కూరు-136(ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గానికి అభిజిత్ ముఖర్జీ, నంద్యాల-139 అసెంబ్లీ నియోజకవర్గానికి రాహుల్ సింగ్, బనగానపల్లె-140 అసెంబ్లీ నియోజకవర్గానికి డాక్టర్ వేద్ ప్రకాష్ మిశ్రా, డోన్-141 అసెంబ్లీ నియోజకవర్గానికి అమిత్‌కుమార్‌లను పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమించిందన్నారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సిబ్బందికి సంబంధించి రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ, కౌంటింగ్ సిబ్బంది శిక్షణ, ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నిర్వహణ తదితర అంశాలపై క్షుణ్నంగా పరిశీలించి సూచనలు జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

### ఘనంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడి

# జన్మదిన వేడుకలు

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి జన్మదిన వేడుకలను ఆయన నివాసం మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి నివాసంలో అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, భరద్వాజ్ శెట్టి, నరసింహులు, రంగన్న, తాయన్న, సిద్దప్ప, మధుసూదన్‌రెడ్డి, ఎల్లారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

# గ్రేడ్ -1 పి.పి.ఎస్ లక్ష్మీనారాయణకు ఘనంగా సన్మానం

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** ఫ్రెండ్స్ వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు కర్నూలు ఎల్కూర్ బంగ్లాస్ నందు స్థానిక నారాయణ స్కూల్ పార్క్ గ్రౌండ్ లో డాక్టర్ రజనీకాంత్, మల్లికార్జున పోలీస్, ఆలీ పోలీస్, రాజశేఖర్ Ex army వీరి ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా Dr రజనీకాంత్ మాట్లాడుతు లక్ష్మీనారాయణ గ్రేడ్ -1 ప్ గా మన కర్నూలు జిల్లాకు వేయడం మన జిల్లా వాసుల అదృష్టంగ భావిస్తున్నాను అని కొనియాడారు. బాషా టీచర్ మాట్లాడుతు ppగా ప్రమోషన్ తీసుకోవడం మాదృష్టం గభవిస్తున్నాను, మరిన్ని పదవులు చేపట్టి ప్రజల మన్నలు పొదలని కోరుచున్నాము అని అన్నారు. వారి మిత్రులు, అందరూ కలిసి లక్ష్మీనారాయణ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ డిస్టిక్ అడిషనల్ సెషన్ కోర్టు కర్నూల్ గా నియమితులు అయినందున ఫ్రెండ్స్ వాలీబాల్ అసోసియేషన్ వారు లక్ష్మీనారాయణ %ూ% గారిని ఘనంగా సన్మానించారు. అసోసియేట్ సభ్యులు బంగి సూరి. శర్మ సార్ భార్గవ్ రవికుమార్ రాజేష్ దినేష్ లాఫింగ్ శ్రీను అశోక pc



సిమెంట్ రాజశేఖర్ మొదలగు సభ్యులందరు ఆనందం వ్యక్తంచేసినారు.

### ఉచిత వైద్య శిబిరాలను

# పేదలు సద్వినియోగం చేసుకోవాలి

### సంతానం లేని దంపతులకు ఉచిత వైద్య శిబిరం ఎంతో ఉపయోగం

**కర్నూలురూరల్, మేజర్‌న్యూస్ :** కర్నూల్ నగరంలోని మదర్ తెరిసా విగ్రహ సమీపంలో ప్రైమ్ ప్లస్ హాస్పిటల్లో ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా ఆదివారం ఉచితంగా ఐ వి ఎఫ్ మెడికల్ కౌన్సిల్ క్యాంపు జరిగింది. సందర్భంగా డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ విలువైన వైద్యాన్ని పేద ప్రజలకు అందించేందుకే శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ డాక్టర్ గౌతమ్ చెప్పారు. శిబిరంలో పాల్గొన్న వారికి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా ఆడవారికి స్కానింగ్ చేయడం, ఉచితంగా



మగవారికి వీర్య కణాలను చూడటం జరిగిందని, ఈ ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన వారికి వైద్యం ఎంతో ఖర్చుతో కూడుకున్నట్లయితే వారికి రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. పిల్లలు కానీ వారికి ఎవరిలో ఏ లోటు ఉందో తెలియజెప్పి వారు కుటుంబంలో సుఖసంతోషాలతో జీవించేలా చేయడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. అందుచేత ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని డాక్టర్ గౌతమ్ చెప్పారు. డాక్టర్లు సోఫియా రాణి, పావని, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

### 2 వేల మంది పోలీసులతో

# కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

- కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్
- జూన్ 4న రాయలసీమ యూనివర్శిటీ కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్
- భారీగా పోలీసు బలగాల మొహరింపు

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** జూన్ 4న కర్నూలు జిల్లా కేంద్రంలోని రాయలసీమ యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సంధర్భంగా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశామని కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధం చేశాం. జిల్లాలో శాంతియుతం వాతావరణం కు రాజకీయ పార్టీలు, ప్రజలు, మీడియా సహకరించాలి. ట్రబుల్ మాంగర్స్, రౌడీషటర్ల పై ప్రత్యేక నిఘా ఉంచాం. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకుంది. రాయలసీమ యూనివర్సిటి దగ్గర బందోబస్తు వివరాలను ఎస్పీ గారు వెల్లడించారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలు , 6 మంది డిఎస్పీలు, 20 మంది సిఐలు, 28 మంది ఎస్సైలు , 84 మంది ఎఎస్సైలు / హెడ్ కానిస్టేబుల్స్, 120 మంది కానిస్టేబుల్స్ , 40 మంది మహిళా కానిస్టేబుల్స్ , 196 మంది హెూంగార్డులు, 87 మంది ఎఆర్ పోలీసులు, 2 స్పెషల్ పార్టీలు, కేరళ స్పెషల్ ఆర్మడు పోలీసు బలగాలు రాయలసీమ యూనివర్సిటి దగ్గర బందోబస్తు విధులలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా, కౌంటింగ్ కేంద్రంతో కలుపుకుని , సబ్ డివిజన్ లలో బందోబస్తు వివరాలు...

ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 10 మంది డిస్పీలు, 51 మంది సిఐలు, ముగ్గురు ఆర్ ఐలు, 73 మంది ఎస్సైలు , 9 మంది ఆర్ ఎస్సైలు, 1060 మంది సివిల్ పోలీసులు , 200 మంది ఎఆర్ పోలీసులు , 300 మంది హెూంగార్డులు ,జిల్లా పోలీసులతో పాటు ఇతర జిల్లాల పోలీసులతో పాటు, కేంద్ర పోలీసు బలగాలలోని SPF 20 మంది , SAR 24 మంది , కేరళ సిఎ పి ఎఫ్ 1 కంపెనీ, బిఎస్ ఎఫ్ 1 కంపెనీ ఈ బందోబస్తు విధులలో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 188 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 188 పోలీసు పికెట్స్ ను ఏర్పాటు చేశాం. కౌంటింగ్ రోజున ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్టాటిక్ పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. 91 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు , పోలీసు రూట్ మొబైల్స్ లతో కౌంటింగ్ కేంద్రం వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేశాము.

57 QRTలను అన్ని సున్నితమైన పికెట్‌లలో సిఐ, ఎస్ఐ నేతృత్వంలో పెట్రోలింగ్ నిర్వహించే విధంగా ఏర్పాటు చేశాం. 67 రూట్ మొబైల్ టీమ్ లను , 2 కంట్రోల్ రూములు , 14 బాడి ఒన్ కెమెరాలు, 9 విడియో కెమెరాలు, ఏర్పాటు చేశాం. ఇతర ముఖ్య నేతల కదలికలపై నిఘా ఉంచేందుకు గాను షాడో పార్టీలు, ఎవ్వరైనా సమస్యలు సృష్టిస్తే అటువంటి వారిని గృహ నిర్బంధం చేయుటకు గాను టీమ్ లను ఏర్పాటు చేయడం జరిగింది. 8 టియర్ గ్యాస్ టీమ్‌లు ఏర్పాటు చేశాం. లా అండ్ ఆర్డర్ సమస్యలు ఎదురైనా తరుణంలో వాటిని పరిష్కరించుటకు గాను ఏర్పాటు చేయడం జరిగింది. 41 ప్రాంతాలను గుర్తించి కౌంటింగ్ రోజున అన్ని పార్టీ కార్యాలయాలు, పోటీ చేసే అభ్యర్థుల ఇళ్ల వద్ద, ముఖ్య నేతల ఇళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశాం. కర్నూలు పట్టణ శివారులలో 8 చెక్ పోస్టులు



ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా మొత్తం 31 చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. 1775 గ్రామ సభలు నిర్వహించి ఎన్నికల గొడవలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించాం. 39 ముఖ్యమైన జంక్షన్ లు గుర్తించాం. 48 షాడో పార్టీలను , 65 రాత్రి గస్తీ బృందాలు ఏర్పాటు చేశాం. 46 మంది పోటెన్సియల్ ట్రబుల్ మాంగర్స్ ను గుర్తించాం. సమస్యలు సృష్టించే అనుమానమున్న 7,094 మందిని బైండోవర్ చేశాం. అవసరమైన చోట్ల , అత్యవసరమైన చోట్ల 18 పోలీసుల బలగాలను ఏర్పాటు చేశాం. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నాము. కౌంటింగు జరిగే జిల్లా కేంద్రంతో పాటు అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లో, సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక నిఘా వేశాం. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం బాణసంచా నిల్వ ఉంచడం, క్రయ విక్రయాలు చేయడం, కాల్చడం నిషేధము. ఎవరైనా అనధికారికంగా మద్యం, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం . శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా... ముందస్తు చర్యలులో భాగంగా రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితులు, పాత కేసుల్లో నిందితుల ఇళ్ల పరిసరాలలో జిల్లాలో 65 చోట్ల కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించాం. జిల్లా అంతటా కౌంటింగు ముగిసే వరకు 144 సెక్షన్ ఉత్తర్వులను గట్టిగా అమలు చేస్తాం. నలుగురి కంటే ఎక్కువ ప్రజలు గుమిగూడకూడదు. ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా కర్నూలు పట్టణంలో 144 సెక్షను మరియు 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుంది. కాబట్టి ప్రజలు అవసరమైతే మాత్రమె తప్ప రోడ్లపైకి రాకూడదని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరైనా కౌంటింగ్ సమయంలో అవాంతరాలు కల్పించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే ఏజెంట్లు, అభ్యర్థులు(క్యాండిడేట్స్) ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలి.

- ఎన్నిక ఫలితాలు వెలువడిన అనంతరం గెలుపొందిన అభ్యర్థులు వారి మద్దతుదారులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, డప్పులు వాయించడం, పెద్ద శబ్దాలు, బాణసంచా పేల్చడం వంటివి నిషేధించాం.
- గెలుపోటములు సహజమని, ఓడిన వారి పట్ల కవ్వింపు చర్యలకు పాల్పడటం, హేళన చేయడం, రెచ్చగొట్టడం చేయరాదు.
- కౌంటింగ్ వేళ అపరిచితులు, అనుమానితులు లాడ్జిల్లో బస చేయకుండా చర్యలు తీసుకున్నాం. లాడ్జిల్లో తనిఖీలు ముమ్మరం చేశాం.
- యువత అల్లర్లు, గొడవ లలో పాల్గొని , కేసుల్లో ఇరుక్కొని భవిష్యత్తును పాడు చేసుకోకూడదని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# అద్వానీకి అత్యున్నత పౌర పురస్కారం..




**ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా అట్టడుగు స్థాయి నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన అద్వానీ స్వయంకృషితో ఉప ప్రధానిగా ఎదిగారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి అడుగులు పడటంలో జరిగిన పోరాటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. రెండు లోక్‌సభ సీట్లు ఉన్న పార్టీని అనతికాలంలోనే బలోపేతం చేసి అధికార పార్టీగా ఎదిగేలా చేశారు. ఏ పదవైనా అంకిత భావంతో నిర్వర్తించారు. అద్వానీకి భారతరత్న పురస్కారం ప్రకటించిన సందర్భంగా ఆయన జీవిత విశేషాలు తెలుసుకుందాం...**

1984లో కేవలం రెండు లోక్‌సభ సీట్లు ఉన్న పార్టీని.. తన కష్టంతో.. వ్యూహచాతుర్యంతో అనతి కాలంలోనే బలోపేతం చేసి.. 1996లో ఏకైక అతిపెద్ద పార్టీగా 1998,99ల్లో అధికార పార్టీగా ఎదిగేలా చేశారు. రామజన్మభూమికి సంపూర్ణ మద్దతు ప్రకటించి సోమ్‌నాథ్ నుంచి అయోధ్య వరకు రామ రథయాత్ర చేపట్టి.. రామాలయ నిర్మాణాన్ని బీజేపీ ప్రధాన ఎజెండాగా మార్చేశారు. బీజేపీని కాంగ్రెస్, వామపక్షాలు అంటరాని పార్టీగా చూసినా.. సమతా పార్టీ, జనతాదళ్ వంటి సోషలిస్టు పార్టీలు దానిని అక్కున చేర్చుకునేలా చేశారు. తన సారథ్యంలో బీజేపీ గెలిచినా.. ప్రధాని పదవికి అటల్ బిహారీ వాజపేయిని ప్రతిపాదించి.. తనకు పదవీలాలస లేదని.. పదవుల కంటే పార్టీయే మిన్నని చాటారు. హవాలా కుంభకోణం డైరీల్లో తన పేరు ఉండడంతో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. కోర్టులో కేసు తేలేవరకు ప్రభుత్వానికి దూరంగా ఉన్నారు. పాకిస్థాన్‌లో తన జన్మస్థానమైన కరాచీ వెళ్లి.. ద్విజాతి సిద్ధాంతకర్త, ముస్లింలీగ్ వ్యవస్థాపకుడు మహ్మదాలీ జిన్నాను లౌకికవాది అని పొగిడి సంఘ్ ఆగ్రహాన్ని చవిచూశారు. సంఘ్ 2014లో ఆయన్ను కాదని.. ఆయన శిష్యుడైన గుజరాత్ సీఎం నరేంద్ర మోదీని తెచ్చినా మౌనంగా ఉన్నారు. గత ఐదేళ్లుగా పూర్తిగా రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయనకు ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించింది.

**జీవిత విశేషాలు..**

- ఆద్వానీ 1927 నవంబరు 8న కరాచీలో పుట్టారు.
- 1942లో 14వ ఏట ఆరెస్సెస్‌లో చేరారు.
- 1947 సెప్టెంబరులో దేశ విభజన విద్వేషాలు ప్రజ్వరిల్లిన సమయంలో కట్టుబట్టలతో పాకిస్థాన్ నుంచి తప్పించుకుని రైలులో ఢిల్లీ చేరుకున్నారు.
- ఆరెస్సెస్ కార్యకర్తగా రాజస్థాన్‌లో పనిచేశారు. గాంధీజీ హత్యానంతరం ఆరెస్సెస్‌ను నిషేధించినప్పుడు అజ్ఞాత వాసం గడిపారు.
- సంఘ్ మార్గదర్శకత్వంలో ఏర్పాటైన భారతీయ జన సంఘంలో చేరారు. అప్పటికే జనసంఘ్ తరఫున లోక్‌సభ సభ్యుడిగా ఉన్న అటల్ బిహారీ వాజపేయికి సహాయకుడిగా 1957లో ఢిల్లీ వచ్చారు.
- 1965లో కమలను వివాహం చేసుకున్నారు.
- 1972లో జనసంఘ్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.
- 1970 -1976 వరకు అద్వానీ ఢిల్లీ నుండి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు.
- 1976 - 1982 వరకు గుజరాత్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు.
- ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో 1975 జూన్‌లో వాజపేయితో పాటు అరెస్టు అయ్యారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో జనతా పార్టీ గెలిచాక మొరార్జీ ప్రభుత్వంలో 1977 మార్చి నుంచి 1979 జూలై వరకు కేంద్ర సమాచార మంత్రిగా ఉన్నారు.
- జనవరి 1980 నుంచి ఏప్రిల్ 1980 వరకు రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా పని చేశారు.
- 1980లో బీజేపీ స్థాపనలో ముఖ్య పాత్ర పోషించారు. 1986లో వాజపేయి తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై 1991 వరకు కొనసాగారు.
- రామాలయ నిర్మాణం డిమాండ్‌తో 1990 సెప్టెంబరు 25న సోమనాథ్ నుంచి అయోధ్యకు రామ రథయాత్రకు శ్రీకారం చుట్టారు.
- మతకల్లోలాలకు యాత్ర ఆజ్యం పోస్తోందంటూ నాటి సీఎం లాలూప్రసాద్ రథ యాత్రను అడ్డుకున్నారు. 1990 అక్టోబరు 24న బిహార్లోని సమస్తిపూర్‌లో ఆద్వానీ అరెస్టు అయ్యారు.
- 1991 లోక్‌సభ ఎన్నికల్లో 120 సీట్లలో బీజేపీ ఘనవిజయం సాధించారు.
- 1992 డిసెంబరు 6న అయోధ్యలో కరసేవ సందర్భంగా ఆద్వానీ, వాజపేయి, ఇతర బీజేపీ అగ్ర నేతల సమక్షంలోనే బాబ్రీమసీదు కూల్చివేత ఘటన.
- 1996 ఎన్నికల్లో తొలిసారి బీజేపీ 161 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరణ. ప్రధానిగా వాజపేయి ప్రమాణం. సాధారణ మెజారిటీ కూడగట్టుకోలేక పదవికి రాజీనామా.
- 1998 ఎన్నికల్లో 182కి పెరిగిన బీజేపీ ఎంపీ స్థానాలు. ఇతర పార్టీలతో ఎన్‌డీఏ ఏర్పాటుచేసి గద్దెనెక్కిన వాజపేయి. హోం మంత్రిగా ఆద్వానీ బాధ్యతలు చేపట్టారు.
- 1998-2004 వరకు కేంద్ర హోం మంత్రిగా.. 2002 నుంచి 2004 వరకు దేశ ఉపప్రధానిగా ఆద్వానీ పని చేశారు.
- 2009-14 నడుమ ప్రధాన ప్రతిపక్ష నేత.
- 2013లో బీజేపీ ఎన్నికల ప్రచార సారథిగా గుజరాత్ సీఎం మోదీని ప్రతిపాదించిన సంఘ్.
- 2014లో బీజేపీకి తొలిసారి లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీ లభించింది. మోదీ ప్రధానిగా ఎన్నికయ్యారు. ఆద్వానీ లోక్‌సభకు ఎన్నికైనా.. ఎలాంటి పదవీ లభించలేదు. తరువాత ఆద్వానీ ప్రత్యక్ష రాజకీయాలనుంచీ పూర్తిగా వైదొలిగారు.
- తాజాగా భారతరత్న పురస్కారం పొందారు.



**ఈ జీవితం దేశానికి అంకితం**

"ఈ జీవితం నాది కాదు.. దేశానిది (ఇదం నమమ)" అన్న సంస్కృత సూక్తే నాకు ప్రేరణ. 14వ ఏట ఆర్ఎస్ఎస్‌లో చేరా. నా ప్రియమైన దేశం కోసం ఏ బాధ్యత అప్పగించినా అంకితభావంతో సేవలందించా. దశాబ్దాల ఈ నిస్వార్థ సేవకు ప్రతిఫలం లభించింది. వ్యక్తిగతం గానే కాదు.. నా ఆశయాలు, సిద్ధాంతాలకు గౌరవం దక్కింది"

-ఎల్‌కే ఆద్వానీ

మన కాలంలో అత్యంత గౌరవనీయుడైన రాజనీతిజ్ఞుడు, దేశ అభివృద్ధికి చరిత్రాత్మకమైన పాత్ర పోషించిన నాయకుడు ఆద్వానీ. ఆయన జీవితంలో అట్టడుగు స్థాయి నుంచి దేశానికి సేవ చేయడం ప్రారంభించి ఉప ప్రధానిగా ఎదిగారు. ఆద్వానీ నుంచి నేర్చుకునేందుకు లెక్కలేనన్ని అవకాశాలు రావడం అదృష్టం

- నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి

# ఆంధ్రప్రదేశ్ నూతన జిల్లాల వివరాలు

(10వ పేజీ తరువాయి..)

- కోటిపల్లి, ర్యాలి, మందపల్లి, అయినవిల్లి, ద్వారపూడి, అప్పనపల్లి, మురమళ్ళ, పలివెల, ప్రాంతాలు పర్యాటక ప్రాంతాలు.
- ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయం (స్వామి వారి పాదాల వద్ద నిరంతరం నీరు ప్రవిస్తూ ఉంటుంది.)
- ప్రముఖులు : బోయి భీమన్న
- కోనసీమలో అమలాపురం పెద్ద పట్టణం
- కోనసీమను ఆంధ్రప్రదేశ్ ఉద్యానవనంగా పిలుస్తారు.
- రామచంద్రపురం కోటను 1865లో నిర్మించారు.
- రావులపాలెంలోని అరటి మార్కెట్ ఆసియాలోనే పెద్దదిగా పేరుగాంచినది.

**9. తూర్పు గోదావరి**

- విస్తీర్ణం : 2,561 చ.కి.మీ.
- జిల్లా కేంద్రం : రాజమండ్రి
- మండలాలు : 19
- రెవిన్యూ డివిజన్లు : రాజమండ్రి, కొవ్వూరు
- అరటి పరిశోధన కేంద్రం - కొవ్వూరు
- కొబ్బరి పరిశోధనా కేంద్రం - రాజమండ్రి
- ఆంధ్రుల సాంస్కృతిక రాజధాని - రాజమండ్రి
- సెంట్రల్ టుబాకో రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిటీఆర్ఐ) ఇక్కడే కలదు.
- **ముఖ్యమైన ప్రాజెక్టులు :** తోట వెంకటాచలం పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్, ఏలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు, వెంకటనగరం పంపింగ్ స్కీమ్, తొర్రిగెడ్డ పంపింగ్ పథకం.
- పర్యాటక కేంద్రాలు: బిక్కవోలు (రాతి దేవాలయాలకు ప్రసిద్ధి)
- పచ్చని అందాల నర్సరీలు - కడియపు లంకలో కలవు.
- ఆంధ్రప్రదేశ్‌లో తొలి సహజ వాయువు ఆధారిత విద్యుత్ కేంద్రాన్ని విజ్జేశ్వరంలో స్థాపించారు.
- రాష్ట్రంలో మొదటి పేపర్‌మిల్లు (ఏ.పి. పేపర్ మిల్) 1924లో రాజమండ్రిలో ప్రారంభమైనది.



- రాష్ట్రంలో మొదటి నూలుమిల్లు వేంద్రలో ప్రారంభించారు.
- సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ 1852లో బ్యారేజ్ నిర్మించారు.
- రాష్ట్రంలో అత్యంత పొడవైన రోడ్ కమ్ రైల్ బ్రిడ్జ్ గోదావరి నదిపై రాజమండ్రి నుండి కొవ్వూరు మధ్య కలదు. (4.1 కి.మీ.)

**10. పశ్చిమ గోదావరి**

- జిల్లా కేంద్రం : భీమవరం
- విస్తీర్ణం : 2,178 చ.కి.మీ.
- జనాభా : 17.80 లక్షలు
- మండలాలు : 19
- బొగ్గు ఉత్పత్తి లో ప్రథమ స్థానం
- ఆంధ్రప్రదేశ్ హరిత విప్లవాన్ని ప్రవేశపెట్టిన మొట్టమొదటి జిల్లా
- 100% ఇళ్ళకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించిన తొలిజిల్లా.
- మార్టేరులో వరి పరిశోధనా కేంద్రం.
- గేదెల పరిశోధన కేంద్రం వెంకట్రామన్న గూడెంలో కలదు.
- డెల్టా పేపర్ మిల్స్ వేంద్రలో కలదు.
- ఆంధ్ర చక్కెర కర్మాగారం తణుకు 1952లో స్థాపించారు.
- **పర్యాటక ప్రదేశాలు :**
- పాలకొల్లు : క్షీర లింగేశ్వరస్వామి ఆలయం
- పెనుగొండ : వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు
- భీమవరం : సోమేశ్వరాలయంలో శివలింగం. అమావాస్యనాడు నలుపు-గోధుమ రంగులోకి, పౌర్ణమినాడు తెలుపు రంగులోకి మారటం స్వామివారి మహిమ
- రాష్ట్రంలో తొలి ఫిషరీస్ విశ్వవిద్యాలయం నరసాపురంలోని వేముల దీవి గ్రామంలో నిర్మాణం చేపట్టారు.
- ప్రముఖులు : అడవి బాపిరాజు, దేవరకొండ బాల గంగాధర తిలక్, అల్లూరి సీతారామరాజు

**11. ఏలూరు**

- విస్తీర్ణం : 6,679 చ.కిమీ.
- జనాభా : 20.717 లక్షలు
- మండలాలు : 28
- కోట రామచంద్రపురం గ్రామం కోయ నృత్యానికి ప్రసిద్ధి. మంగళవారం నాడు ప్రదర్శిస్తారు.
- జీలకర్ర గూడెం ప్రముఖ బౌద్ధక్షేత్రం.
- ఏలూరు ఎర్ర తివాచీలకు ప్రసిద్ధి.
- నూజివీడు మామిడి తోటలకు, విత్తన పరిశ్రమలకు ప్రసిద్ధి.
- ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి రాగిరేకు శాసనం లభించిన ప్రాంతం గండిగూడెం. (ఏలూరు జిల్లా)
- ప్రాజెక్టులు: 1.కరాటం కృష్ణమూర్తి యర్రకాల్వ రిజర్వాయర్
  2. తమ్మిలేరు రిజర్వాయర్
  3. విజయరాయ్ అనికాట్ ప్రాజెక్టు
  4. కొవ్వాడ రిజర్వాయర్
- ప్రాంతాలు : గుంటుపల్లి (బౌద్ధ గుహలు)
- శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం (గోకుల పారిజాత గిరి దేవాలయం)
- ద్వారకా తిరుమల (దీన్ని చిన్న తిరుపతి, రెండో తిరుపతి అని పిలుస్తారు)
- పట్టిసీమ : పురాతన పంచశివ క్షేత్రాల్లో ఒకటి.
- కొల్లేరు సరస్సు మంచినీటి సరస్సు. 260 చ.కి.మీ. సైబీరియన్ క్రేన్‌కు ప్రసిద్ధి.

# కమనీయం ఆహ్లాదకరం లింగమయ్య స్వామి దేవస్థానం







(మొదటి పేజి తరువాయి)

శిథిలావస్థకు చేరి కనుమరుగవుతున్నాయి. దేవాలయాల మనుగడను ప్రజల్లో ఉన్న భక్తి భావాలను పెంపొందించడానికి కొందరు పెద్దలు మరుగున పడిపోతున్న దేవాలయాలను అన్ని సౌకర్యా లతో అభివృద్ధి చేసి భక్తులకు ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. రుద్రవరం మండలంలోని తిప్పారెడ్డి పల్లి గ్రామ సమీపంలో వెలసిన లింగమయ్య స్వామి దేవస్థానమును కమిటీ సభ్యులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మండల కేంద్రం రుద్రవరం కు తిప్పారెడ్డి పల్లి గ్రామ సమీపాన 6 కిలోమీటర్ల దూరంలో లింగమయ్య స్వామి దేవస్థానం వెలసింది. ఈ దేవస్థానంలో దాదాపు వందల సంవత్సరాల క్రితం లింగమయ్య స్వామి స్వయంభుగా వెలిశారని ప్రజల విశ్వాసం. ఈ స్వామిని కొలిచిన వారికి సకల పాపాలు తొలగిపోయి వారికి సుఖశాంతులతో జీవిస్తారని ప్రజలు విశ్వసిస్తారు. ఈ దేవస్థానంలో ప్రతి ఆదివారం నంద్యాల జిల్లాతో పాటు కడప, కర్నూలు, అనంతపురం, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి తమ ముక్కులు తీర్చుకుంటున్నారు. ఈ దేవస్థానంలో శుభ కార్యక్రమాలు చేసుకునే వారికి అన్ని సౌకర్యాలతో కళ్యాణ మండపం ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు స్నానాలు చేయడానికి లక్షలాది రూపాయలతో అన్ని అంగులతో స్విమ్మింగ్ పూల్ నిర్మించారు. అలాగే మంచి ఫలాలనుచ్చే చెట్లు ఔషధ మొక్కల తోగార్డెన్ గా ఏర్పాటు చేశారు. నిరుపేదలు ఎవరైనా శుభకార్యాలు చేసుకునే సమయంలో అతి తక్కువ ఖర్చుతో శుభకార్యాలు చేసుకోవడానికి అన్ని సౌకర్యాలను నిర్వాహకులు కల్పించారు. తిప్పారెడ్డిపల్లి నుంచి దేవస్థానముకు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపున చెట్లను నాటించడంతో భక్తులను ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. లింగమయ్య స్వామిని దర్శించుకున్న వారికి సకల పాపాలు తొలగిపోయి సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ దేవస్థానం పర్యాటకంగా భక్తులకు కనువిందు చేస్తుంది.





సూర్య
సోమవారం | 03 జూన్ 2024

# బెట్టింగులకు ఆకర్షితులవుతున్న యువత



బండిఆత్మకూరురూరల్, మేజర్‌న్యూస్ : చేతిలో అంతర్జాలంలో యువత భవిష్యత్తు ఎటువైపు వెళుతుందో ప్రతీదీ తల్లిదండ్రులు నిఘా పెట్టాల్సిన అవసరం నేటి సమాజంలో ఏర్పడింది. ముఖ్యంగా ఐపిఎల్ మొదలుకొని నిన్నటి నుండి ప్రారంభమైన టి20 వరల్స్ కప్‌లతో యువత బెట్టింగ్‌ల వైపు ఆకర్షితులవుతున్నారు. పల్లె గ్రామాలలో కూడా విపరీతమైన మొబైల్ ఫోన్లో వాడకం అధికమవడంతో పాటు ధన సంపాదన ఆశించి యువత చెడు వ్యసనాల వైపు పయనిస్తుండడం ఆందోళన కలిగించే అంశం. బెట్టింగులపై యువత మధ్యన సంభాషనలకు తోడు, ఒకరిని మించి మరొకరు క్రికెట్ బెట్టింగుల వైపు పయనిస్తున్నారు. గ్రామాలలో యువత మొబైల్ ఫోన్లతో పగలు రాత్రి బిజీ బిజీగా గడుపుతూ తమ జీవితాన్ని పూర్తిగా అంతర్జాలంతోనే బతికేస్తున్నారు. మండలంలో ముఖ్యంగా బండిఆత్మకూరు, ఈర్నపాడు, సంతజూటూరు, పెద్దదేవళాపురం, తదితర గ్రామాలలో యువత బిట్టింగులపై వైపు ఆకర్షిలవుతున్నారని సమాచారం. 15 సంవత్సరాల యువకులు కూడా బెట్టింగ్ బానిసలు అవుతున్నారంటే చేతిలో ఉన్న మొబైల్ అంతర్జాలం యువతను ఏవిధంగా దృష్టి మళ్లిస్తుందో అర్థం చేసుకోవాలి. బెట్టింగులతో కొందరు జీవితంలో నాశనం చేసుకుంటే మరికొందరు జల్సాలకు అలావటు పడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నరు. డిజిటల్ సేవలను మంచి పనులకు ఉపయోగించుకోవల్సింది పోయి చెడు మార్గానికి వినియోగించుకునేందుకే యువత మొగ్గ చూపుతోంది. మ్యాచ్‌కు సంబంధించిన ప్రతి వ్యవహారం అంతా వాట్సప్, హైక్, మెసెంజర్‌ల రూపంలో



ఆన్‌లైన్‌లోనే సాగుతోంది. మ్యాచ్ ప్రారంభమైన 20 నిమిషాల ముందే ఆయా జట్ల బలబలాలపై రేటింగ్స్‌పై కాసేందుకు

- చేతి అంతర్జాలంతో ప్రమాదంలో యువత భవిత
- పందెం కోసం బైక్‌లు, బంగారం తాకట్టు పెడుతున్న యువత
- చిన్న వయసులోనే మద్యం, ధూమపానం వైపు చూపు
- పిల్లల కదలికలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

బూకీలకు సంబంధించిన ఏజెంట్లు యువతకు విషయాన్ని చేరవేస్తున్నారు. దీంతో యువత చిల్లిగవ్వ లేకపోయిన అప్పుగానో, వస్తువులు తాకట్టు పెట్టో డబ్బును బెట్టింగ్‌లో పెడుతున్నారు. పందెంలో గెలిచినా, ఓడినా సరే డబ్బు కూడా ఆన్‌లైన్‌నే బదిలీ అవుతుంది. ముఖ్యంగా ఆన్‌లైన్ సర్వీసులు అయిన తేజ్, పేటిఎం, ఫోన్‌పే యాప్‌ల నుంచి నగదును ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. క్యాష్‌లెస్‌గా ఈ వ్యవహారం కొనసాగుతోంది. కాగా పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేస్తే ఇలాంటి బూకీల ఆటలు కట్టించడం పోలీసులకు కష్టమేమి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు బెట్టింగ్‌లతో పాటు యువత మద్యం ధూమపానాలకు అధిక సంఖ్యలో ఆకర్షితులవుతున్నారు. మద్యానికి బానిసలై తాగిన మత్తులో చిందులు వేస్తూ చిన్న వయసులోనే వారి కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. చీప్‌లిక్కర్ వ్యసనపరులై చెడు వ్యసనం బారినపడి ఇటు ప్రభుత్వాలకు, అటు మందు దుకాణాల వారికి కోట్లాది రూపాయలు ఆర్జించి పెడుతూ తమ భవిష్యత్తులను నాశనం చేసుకుంటున్నారు. వీరు మాత్రం ఈ మందు మత్తులో చిక్కుకుపోయి బికారులు అవుతూ, జేబులకు చిల్లులు పెట్టుకుంటున్నారు. మందుబాబులు విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవిస్తూ ఉండటం చర్యలు తీసుకోవాల్సిన వ్యవస్థ కూడా నిర్లక్ష్యం వ్యవహరిస్తుండటంతో వీరు చేష్టలకు అడ్డు ఆపు లేకుండా పోతుంది. నేటి యువత రేపటి మన దేశ బంగారు భవిష్యత్‌కు ఆశాకిరణాలు అనే అత్యంత ప్రధానమైన విషయాన్ని నేటి యువత ఎల్లవేళలా గుర్తు పెట్టుకొని మసలుకుంటూ మితిమీరిన వేగం అనే గుర్రానికి సంకెళ్ళు వేయకుంటే జీవితాన్ని నాశనం చేసుకోక తప్పదు. అలా చేస్తే తమనే నమ్ముకున్న తల్లిదండ్రులను, కుటుంబాన్ని రోడ్డుపాలు చేసుకోకుండా సరైన అవగాహన కార్యక్రమాలు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చెయ్యండి

### రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా



కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి : ఎన్నికల నియమ నిబంధనలు పాటిస్తూ కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చెయ్యాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లు జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఆదివారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుండి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కౌంటింగ్ హాలులోకి సెల్ ఫోన్లు అనుమతించవద్దని, రౌండ్ల వారీగా ఖచ్చితమైన ఫలితాలను నిర్దేశించిన ప్రొఫార్మాలలో ఎన్నికల కమిషన్ కు నివేదికలను ఆన్లైన్ ద్వారా పంపించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, కౌంటింగ్ కేంద్రంలో అత్యవసర పరిస్థితులలో బయటకు వచ్చేందుకు అత్యవసర ద్వారం ఏర్పాటుచేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఆవరణంలో మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని అక్కడి వరకు మొబైల్ ఫోన్లకు అనుమతి ఉందని, కౌంటింగ్ హాల్ ల లోకి మాత్రం మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివరిస్తూ కౌంటింగ్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో కౌంటింగ్ జరుగుతున్న 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ హాల్స్ ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ హాల్ లలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చేయవలసిన ఏర్పాట్లు అన్నీ పూర్తి అయ్యాయని వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో బందోబస్త్ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళీ తదితరులు పాల్గొన్నారు.




### కొలిమిగుండ్ల, పెట్నికోట గ్రామాలను

# నంద్యాల జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ

కొలిమిగుండ్ల, మేజర్‌న్యూస్ : కొలిమిగుండ్ల మండలంలోని సమస్యాత్మక గ్రామం అయిన పెట్నికోట గ్రామాన్ని అకస్మిక తనిఖీ చేసి తరువాత కొలిమిగుండ్ల పోలీసు స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జూన్ 4వ తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు వివాదాలకు దూరంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు , ఏజెంట్లు మినహా ఇతరులు ఎవ్వరూ కౌంటింగ్ కేంద్రానికి రాకుండా చర్యలు తీసుకోవాలని ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కొలిమిగుండ్ల ఎస్.ఐని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతోపాటు స్పెషల్ బ్రాంచ్ ఎస్.ఐ హరినాథ రెడ్డి పాల్గొన్నారు.

### కొత్తూరు సుబ్బరాయుని సన్నిధిలో

# నూజివీడు అడిషనల్ జడ్జి పూజలు


జడ్జికి స్వామి వారి ప్రసాదాన్ని అందజేస్తున్న అర్చకులు, సిబ్బంది

నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ : నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన ప్రముఖ శైవక్షేత్రం శ్రీ సుబ్రమణ్యస్వామి దేవస్థానంను కృష్ణా జిల్లా నూజివీడు అడిషనల్ జడ్జి శైలజ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామి వార్లకు అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో శాలువాలు, స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి లడ్డు ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేష్‌శర్మ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### కౌంటింగ్ కేంద్రాల్లో

# పెండింగ్ ఏర్పాట్లు పూర్తి చేయండి

నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ : ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న అరకొర పనులన్నింటినీ వెంటనే పూర్తి చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆర్‌జీఎం కళాశాలలోని కమాండ్ కంట్రోల్ రూం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి కౌంటింగ్ ఏర్పాట్లపై అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కౌంటింగ్ సెంటర్లలో ఎన్నికల కమిషన్ సూచించిన మేరకు పెండింగ్‌లో ఉన్న ఏర్పాట్లను వెంటనే పూర్తి చేసుకుని సిబ్బంది మొత్తం అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 4వ తేదీ ఉదయం 5గంటలకు సిబ్బంది మొత్తం కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాలలో రౌండ్ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల లెక్కింపు ఫలితాలను వెంటనే కమ్యూనికేషన్ సెంటర్‌కు చేరవేయాలన్నారు.



ఎన్నికల అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు

సాధ్యమైనంత వరకు తగ్గించి అవసరం ఉన్న వారికే కౌంటింగ్ ఏజంట్ పాసులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాఅలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఏజంట్ల అవాంతరాలు సృష్టించినా, ఇబ్బందులు కలిగించినా బయటకు పంపించాలన్నారు. సాయంత్రం 5గంటల లోగా ఈవీఎం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, ఆళ్ళగడ్డ, డోన్, బనగానపల్లె, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మల్లికార్జునరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కామేశ్వరరావు, దాసు తదితరులు పాల్గొన్నారు.